క్లుప్తంగా

ఆర్ఎంపీల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో ఆర్ఎంపీలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రిలో ఆదివారం ఆర్ఎంపీల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సమ్మేళనానికి వివిధ మండలాల నుంచి 150 మంది ఆర్ఎంపీలు హాజరయ్యారు. ఈ సమ్మేళనంలో పేదలకు ఎలాంటి వైద్యసేవలు అందించాలి అనే దానిపై చర్చించారు. ప్రతిఒక్కరూ స్నేహభావంతో మెలుగుతూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. తమ సమావేశానికి వసతులు కల్పించిన ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గూడ్లూరు మయూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విస్తారంగా సజ్జ సాగు



పిచ్చాటూరు మండలంలో సాగులో ఉన్న సజ్జ

వరదయ్యపాళెం: నియోజకవర్గంలో ప్రస్తుత సీజన్‌లో సజ్జ పంటను విస్తారంగా రైతులు సాగు చేస్తున్నారు. అడపాదడపా పడుతున్న తొలకరి జల్లులతో సత్యవేడు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో 350 హెక్టార్లకు పైగా సజ్జ పంట సాగు చేస్తున్నట్లు సమాచారం. ఈ పంటకు నీటి వినియోగం తక్కువ కావడం, నామమాత్రపు పెట్టుబడులతో సాగు చేసుకునే పంట కావడంతో అవకాశం ఉన్న చోట్ల సజ్జ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పటికే పంట ఏపుగా పెరిగి పలుచోట్ల ఎన్ను దశలో కూడా ఉంది.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 11 మందికి ఆదివారం సత్యవేడు నియోజక వర్గ టీడీపీ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 11 మందికి రూ.9 లక్షలను పంపిణీ చేశారు.

రచయిత ఆర్‌సీకే.రాజు కథాసంపుటికి పురస్కారం



ప్రథమ కథా సంపుటి పురస్కార సత్కారం అందుకుంటున్న కృష్ణస్వామిరాజు

తిరుపతి కల్చరల్: హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామిరాజును ప్రథమ కథాసంపుటి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ నిర్వహించిన కథా సంపుటాల పోటీలలో ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు రచించిన 'జక్కదొన' కథల పుస్తకానికి ప్రథమ కథా సంపుటి పురస్కారం ప్రకటించారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన పురస్కార ప్రధానోత్సవంలో ఫౌండేషన్ నిర్వాహకులు, పలువురు సాహితీప్రియులు తోట సుభాషిణి, మువ్వా శ్రీనివాసరావు, శ్రీరాం పుప్పాల, పిన్నంశెట్టి కిషన్ అబ్దుల్ రజాక్ హుస్సేన్ చేతుల మీదుగా కథాసంపుటి పురస్కారం ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ, జక్కదొన కథల పుస్తకంలో 21 కథలు పూర్తిగా రాయలసీమ వాసుల జీవనాన్ని ప్రతిబింబిస్తున్నాయని, సామాన్యుడి మనోగతాన్ని తెలియజేసే విధంగా ఉన్నాయని విశ్లేషించారు.

ఉపాధి వేతనాలు అందని ద్రాక్షేనా?

ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గంలో కూలీలకు బకాయిలు రూ.9.5 కోట్లు చెల్లించాల్సి ఉంది. మూడు నెలలుగా అదిగో పులి..ఇదిగో మేక అన్న సామెత చందాన ఇప్పుడు..అప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో ఉపాధి పనులను నమ్ముకున్న నిరుపేద కుటుంబాల కడుపు నిండడం ప్రశ్నార్థకంగా మారింది. మూడు నెలలుగా కూలీ డబ్బులు చేతికందక, చేతిలో చిల్లిగవ్వ లేక, అనారోగ్య సమస్యలున్న వారు సకాలంలో మందులు కొనుక్కోలేక, నిత్యావసర సరుకులను సైతం తీసుకోలేక అవస్థలు పడుతున్నారు. అయితే ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం గమనార్హం.





వరదయ్యపాళెం మండలంలో జరుగుతున్న ఉపాధి పనులు, ఉపాధి వేతనాలు రాలేదంటూ ఆవేదన చెందుతున్న కూలీలు

- కూలీల బకాయిలు రూ.9.5కోట్లు
- 3 నెలలుగా వేతనాలు లేక ఇక్కట్లు
- అవస్థలు పడుతున్న ఉపాధి కూలీలు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాల్లో రూ.40వేలకు పైగా ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. వీరిలో రోజువారీ 15 వేల మందికిపైగా ఉపాధి కూలీలు పనులు చేసుకుంటూ కడుపు నింపుకుంటున్నారు. అయితే నెలల పాటు పనులు చేసినా వేతనాలు రాక, పూట గడవక, పస్తులతో సతమతమవుతున్నారు. అధికారులు మాత్రం అదిగో పైవారం.. ఇదిగో వచ్చే నెలంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప వేతనాలు మాత్రం కూలీల ఖాతాలకు జమ చేయడం లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా 15వేల మందికిపైగా ఉపాధి కూలీలు రోజువారీ పనులు చేపడుతున్నారు. అయితే గడిచిన మూడు నెలలుగా కూలీలకు వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. ఆ దశగా 7 మండలాల్లో పనిచేసిన కూలీలకు సంబంధించి రూ.9.5 కోట్లు వేతన బకాయిలు రావల్సి ఉంది. ఇంత పెద్ద మొత్తంలో కూలీలకు వేతనాలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అయితే పనులు పర్యవేక్షించే అధికారులకు మాత్రం నెలనెలా వేతనాలు అందుతున్నాయి. ఆరుగాలం కష్టించి చెమటోడ్చి పనిచేసే కూలీలకు మాత్రం మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో వారికి ఇల్లు గడవడం కష్టమవుతోంది. కనీస అవసరాలకు చేతిలో డబ్బులు లేక అవస్థలు పడుతున్నట్లు కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఈ పనులను నమ్ముకుని ప్రయివేటు వ్యక్తుల పనులకు వెళ్లలేక పోతున్నామని కూలీలు ఆవేదన చెందుతున్నారు.

ప్రత్యామ్నాయం వైపు కూలీల చూపు

సకాలంలో ఉపాధి వేతనాలు చేతికందని కారణంగా ప్రత్యామ్నాయం వైపు కూలీల చూపు మారుతోంది. దీని కారణంగా పలువురు రైతులు ఉపాధి పనులకు దుమ్మా కొట్టి ప్రత్యామ్నాయ పనుల వైపు దృష్టి సారిస్తున్నారు. రోజూ కష్టపడే కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వకుంటే ఇల్లు ఎలా గడవాలన్నది వారి ప్రశ్న. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పనులు వైపు కూలీల చూపు మారుతోంది.

బకాయిలు విడుదల చేయాలి..



రోజూ ఉపాధి పనులకు వెళ్తున్నా, గతంలో 15 రోజులకోసారి లేదా నెలనెలా కూలీలకు అందాల్సిన వేతనాలు వారి వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ అయ్యేది. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో కూలీలకు అందాల్సిన వేతనాలు సకాలంలో అందక అవస్థలు పడుతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు చేరాల్సిన వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలి.

–రవి, ఉపాధి కూలీ, వరదయ్యపాళెం మండలం

కూలీలను ఇబ్బందిపెట్టడం సరికాదు..



రోజువారీ కష్టపడి పూట గడుపుకునే ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కూలీలకు అందాల్సిన వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. ఉపాధి పనులనే జీవనాధారంగా చేసుకుని జీవించే నిరుపేద కూలీలను ఇలా ఇబ్బందిపెట్టడం సరికాదు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలి.

–నూకతోటి రాజేష్, సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జగన్నాథంనాయుడు

శ్రీకాళహస్తి: బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాలని చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ చైర్మన్ జగన్నాథం నాయుడు అన్నారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణ నిర్వహిస్తున్నారు. శిక్షణలో ఆయన పాల్గొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణించడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ.వెంకటస్వామి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఉత్సవ నిర్వాహకులతో సమావేశం



మాట్లాడుతున్న సీఐ

రేణిగుంట: మండలంలోని కరకంబాడి తారకరామానగర్, పట్టణంలోని వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో ఆదివారం అర్బన్ సీఐ జయచంద్ర సమావేశమై పలు సూచనలు చేశారు. వినాయక చవితి మహోత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రైనీ ఎస్ఐ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

వేమాలమ్మకు సామూహిక పొంగళ్లు





ప్రత్యేక అలంకరణలో వేమాలమ్మ, ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

వరదయ్యపాళెం: మండలంలోని కదూరులో వేమాలమ్మ అమ్మవారికి ఆదివారం స్థానికులు సామూహిక పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక పొంగళ్లతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

క్రమబద్ధీకరణ సద్వినియోగం చేసుకోండి

- తుడా వీసీ శుభం బన్సల్

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం 2020 పొడిగించి సవరణ ఉత్తర్వులు జీఓ నంబర్ 134 జారీ చేసిందని తుడా వైస్ చైర్మన్ శుభం బన్సల్ ఒక ప్రకటనలు తెలియజేశారు. 2020 డిసెంబర్ 31 నాటికి దరఖాస్తు చేసుకోని ప్లాట్ యజమానులకు ప్రయోజనం కల్పించడానికి, 2025 జూన్ 30 ముందు వేసిన అనధికార లేఔట్లలో రిజిస్ట్రేషన్ అయిన అనధికార ప్లాట్లను ప్రణాళికబద్ధంగా తీసుకురావడానికి ఈ పథకం కొనసాగింపు చేసినట్లు తెలిపారు. ఈ పథకం మున్సిపల్, స్థానిక సంస్థలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వెలుపల మాస్టర్ ప్లాన్లు, జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ల పరిధిలోని గ్రామ పంచాయతీలు, పరిశ్రమల ప్రాంత పరిధిలోని ప్రాంతాలకు వర్తిస్తుందని తెలియజేశారు. ఈ పథకంలో ఆమోదించబడిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్ ద్వారా గానీ, స్వయంగా గానీ అనధికార లేఔవుట్‌లో ఉన్న స్థలాలకు ప్లాన్లు తయారుచేసుకుని అపరాధ రుసుంలో 50% లేదా 10,000 రూపాయలకు తగ్గకుండా చెల్లించాలని తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచి 90 రోజులలోపు సంబంధిత యాజమాన్యపు హక్కు పత్రాలు, ప్లాన్లతో ఆన్‌లైన్ పోర్టల్ ఛీఛిఇ ౖఞ జౌౌ. జీ/ ౌఖౌలో దరఖాస్తు చేసుకోవాలని, దీనిని అక్రమ లేఔట్ వేసిన యాజమాన్యం, అందులో ప్లాట్స్ కొనుగోలు చేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కండలేరులో 28.230 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 28.230 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 6840 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1750, పిన్నేరుకాలువకు 30, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భవన నిర్మాణ బోర్డును పునరుద్ధరించాలి

చిల్లకూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక బోర్డును పునరుద్ధరించాలని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కత్తి రవి డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కార్మిక శాఖాధికారి శ్రీకాంత్ కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అనంతరం సీపీఐ నాయకులు రాష్ట్ర 28వ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు.

చంద్రబాబు అంటే గుర్తుకొచ్చేది వెన్నుపోటే

- నూకతోటి రాజేష్
- వీఎస్‌పురంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ
- సమస్యలను ఏకరువు పెట్టిన గ్రామస్తులు



వీఎస్‌పురంలో బాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరిస్తున్న నూకతోటి

బుచ్చినాయుడుకండ్రిగ: చంద్రబాబు పేరు చెబితే అందరికీ గుర్తుకు వచ్చేది వెన్ను పోటేనని, బాబు పాలనంతా నయవంచనేనని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. ఆదివారం మండలంలోని వీఎస్ పురం గ్రామంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వివరించి, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేశారు. క్యూఆర్ కోడ్ ద్వారా గత ఏడాది కాలంలో ప్రతి కుటుంబం ఎంత నష్టపోయారో వివరించారు. నూకతోటి మాట్లాడుతూ చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు, ప్రచారాలతో ప్రజలను మోసం చేయడమే నైజమన్నారు. ఆయన చేసిన తప్పుడు ప్రచారాలకు మద్దతు పలికిన మీడియా చానళ్లకు ఎన్నో లాభాలు, పదవులను అందించిన ఘనత చంద్రబాబుదేన్నారు. అయిన వారిని అందలాలు ఎక్కించిన చంద్రబాబు నిరుపేదలకు మాత్రం పిడికిలిని విదిలించిన పాపాన పోలేదని తెలిపారు. అధికారం ఉన్నా, లేకపోయినా వైఎస్సార్‌సీపీ ప్రజాపక్షమేనన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ అప్పులు చేస్తున్నారన్నారు. రూ.1000 పింఛన్ పెంచి, 5 లక్షల మంది పేదల పింఛన్లు తొలగించారని ఆరోపించారు. టీడీపీ నాయకులు ఇంటి వద్దకు వస్తే మేనిఫెస్టోను అమలు చేసేంత వరకు నిలదీయాలని సూచించారు. మణినాయుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలను ప్రజలు ఏకరవు పెట్టారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గురునాథం, నేతలు జొన్నలగోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, కిరణ్‌యాదవ్, సర్పంచ్ సిద్ధమ్మ, కృష్ణయ్య, జయచంద్రనాయుడు, అశోక్, సుబ్రమణ్యం, మురళి, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు. కాటూరు గ్రామంలో జరుగుతున్న శ్రీమహంకాళి జాతరలో భాగంగా అమ్మవారిని నూకతోటి రాజేష్ దర్శించుకున్నారు.



మహంకాళి దేవతను దర్శించుకుంటున్న నూకతోటి రాజేష్

ఘనంగా ఉట్లోత్సవం



ఉట్లోత్సవంలో యువకులు

చంద్రగిరి: గోకులాష్టమి పురస్కరించుకుని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం ఎదుట ఆదివారం ఉట్లోత్సవం కోలాహలంగా నిర్వహించారు. అమ్మవారి అనుబంధ శ్రీకృష్ణ సమేత రుక్మిణి, సత్యభామలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సమూర్తులు ఆలయం వద్దకు వేంచేపు చేశారు.. దేవేరుల సమక్షంలో ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్లోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను నాలుగు మాడవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

19న ఆటో యూనియన్ జిల్లా మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్: ఆటో రంగ పరిరక్షణ, డ్రైవర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 19న తిరుపతిలో నిర్వహించ తలపెట్టిన ఆటో యూనియన్ జిల్లా మహాసభలకు ఆటో కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో ఆయన జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే ఈ పథకం వల్ల ఆటో కార్మికులు వీధిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆటోకార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆటో కార్మిక కుటుంబానికి రూ.15 వేలు ఇస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రమాద బీమా హెల్త్ ఇన్సూరెన్స్, ఆటో ఇన్సూరెన్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని..ఇలా హామీలు గుప్పించారని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నెరవేర్చకపోవడం శోచనీయమని మండిపడ్డారు. జిల్లా మహాసభల్లో దీనిపై చర్చించ కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, మురళి, వాసు, బాదుల్లా, రవి, మురగ, రమణ పాల్గొన్నారు.

23 నుంచి ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

తిరుపతి కల్చరల్: ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో రెండ్రోజుల జన సేవాదళ్ శిక్షణ శిబిరం ముగింపులో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. ఒంగోలులో రెడ్ షర్ట్ వలంటీర్లు, జన సేవాదళ్ కవాతుకు జిల్లా నుంచి కార్యకర్తలు వందలాదిగా హాజరవుతారన్నారు. ప్రస్తుతం దేశం, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో రెడ్ ఆర్మీ చురుకైన పాత్ర పోషించాలన్నారు. మతోన్మాద రాజకీయాలు, ఆర్ఎస్ఎస్ భావజాలంతో అభ్యుదయ భావాన్ని అణచివేయాలని పాలకులు ప్రయత్నిస్తున్నారని, అభ్యుదయ సాహిత్యంపై దాడి చేస్తున్నారని దీనిని తిప్పి కొట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

రోడ్లు అధ్వాన్నం.. ప్రయాణం నరకం

ఏర్పేడు: మండలంలో రోడ్లు అధ్వాన్నంగా మారడంతో వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని ముసలిపేడు, బత్తినయ్య ఎస్టీ కాలనీ, మర్రిమంద, మన్నసముద్రం, పాగాలి రోడ్లు గుంతలు గుంతలుగా మారి వర్షపు నీటితో చిన్నపాటి మడుగులను తలపిస్తున్నాయి. ముసలిపేడులో హైవేపై పెద్ద మడుగులా మారడంతో రాక,పోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. అలాగే మండలంలోని మన్నసముద్రం–బండారుపల్లి మార్గంలో ఇటీవల వేసిన తారురోడ్డు నాసిరకంగా వేయడంతో అటువైపు వెళ్లే ఇసుక ట్రాక్టర్ల ధాటికి ఛిద్రమైంది. మర్రిమందలో రోడ్లు అంతా గుంతలమయంగా మారింది. గ్రామీణ రోడ్లను బాగు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.





అధ్వాన్నంగా మన్నసముద్రం సమీపంలోని తారురోడ్డు



నీటిమడుగును తలపిస్తున్న ముసలిపేడు రోడ్డు



బత్తినయ్య ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి



పాగాలికి నీటి మడుగును దాటుకుని వెళ్లాల్సిందే